
ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తిరుమల్‌రెడ్డి

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎమ్మెల్యే

హయత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రశాంత వాతావరణంలో అందరు కలిసిమెలిసి జరుపుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ పాత గ్రామంలోని చిన్న మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేష్ ముదిరాజ్, భాస్కర్‌సాగర్, అమీర్, నవీద్, హలీమ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం చైర్మన్ భరత్‌కుమార్

రైతు సంక్షేమమే సహకార సంఘ ధ్యేయం : చైర్మన్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే సహకార సంఘ ధ్యేయమని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం సంఘం ఆవరణలోని గార్డెన్‌లో చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు, రైతులు పలు విషయాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రైతులు సంఘం ద్వారా రుణాలు తీసుకుని తిరిగి సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సహకార సంఘం ద్వారా రైతులకు అందించే ప్రతీ ఒక్క పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల రుణ పరిమితి రూ.10లక్షల నుంచి 15లక్షలకు పెంచుతూ సభ ఆమోదం తెలిపింది. సంఘం వైస్ ఛైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మయాదవ్, మేనేజర్ ఐలేష్‌యాదవ్, డైరెక్టర్లు చిన్నయాదిరెడ్డి, బాల్‌రెడ్డి, బాలనర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలి

చంపాపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీలో రూ.30లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను నాణ్యతగా సకాలంలో పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. త్వరలోనే మాధవనగర్‌కాలనీ రోడ్‌నెంబరు 3నుంచి లక్ష్మీగణేష్‌నగర్‌కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, కాలనీ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు బెనర్జీ, అనసూయ, చందునాయక్, ప్రేమ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, పాండయ్య, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు దశరథ్‌గౌడ్, వేణుగౌడ్ పాల్గొన్నారు.

కాలనీ రోడ్లు మూసేసిన వ్యక్తులపై మీర్‌పేట్ పోలీసులకు హైడ్రా ఫిర్యాదు

సరూర్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ బోయపల్లి ఎన్‌క్లేవ్‌లో కాలనీ రోడ్లను మూసేసిన వ్యక్తులపై హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ గురువారం రాత్రి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆయన తమ సిబ్బందితో వచ్చి రోడ్లకు అడ్డంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించి, పార్కు స్థలాన్ని సైతం స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా భూయజమానులు కాలనీ రోడ్లను ప్రీకాస్ట్ గోడలతో మూసేసి, పార్కు స్థలాన్ని సైతం ఆక్రమించారని హైడ్రా ఇన్‌స్పెక్టర్ మీర్‌పేట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు ఆక్రమణలను గురువారం తాము తొలగించినట్టు అందులో పేర్కొన్నారు. ఈ దృష్ట్యా వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన పోలీసులను కోరారు. కాగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు మీర్‌పేట్ ఎస్‌ఐ జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బస్తీ నాలాలో డ్రైనేజీ లైన్ కలపొద్దు : శ్వేతారెడ్డి

సైదాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ డీఎస్ నగర్ బస్తీ నాలాలో నూతన అపార్ట్‌మెంట్ టీన్ టవర్ డ్రైనేజీ పైప్‌లైన్ కలిపే ప్రసక్తే లేదని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-7 డిప్యూటీ కమిషనర్ మంగతాయారు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి అపార్ట్‌మెంట్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను, బస్తీనాలాను పరిశీలించారు. అపార్ట్‌మెంట్ డ్రైనేజీ పైప్‌లైన్ నాలాలో కలిపితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆందోళన పడవద్దని, ఎట్టి పరిస్థితుల్లో డ్రైనేజీ కనెక్షన్ కలుపనీయమని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ ఏకాంబరం, ఏఈ శిరీష, జలమండలి మేనేజర్ మినాజ్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రమేష్, బస్తీవాసులు వరికుప్పల యాదయ్య, బలరాం, చందర్, శ్రీనివాస్, హరి, ప్రశాంత్, కాశీరాం పాల్గొన్నారు.

డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా : రాగుల

వనస్థలిపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పరిష్కరిస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రాంతిహిల్స్, రేడియో కాలనీల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో క్రాంతిహిల్స్‌కాలనీ అధ్యక్షుడు బద్దం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, కోశాధికారి వి.మనోహర్, శ్రీనివాస్, నారాయణ, భిక్షపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.16.12కోట్లు మంజూరు

చంపాపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని వివిధ కాలనీలలో పలు అభివృద్ధి పనుల కోసం రూ.16కోట్ల12లక్షల62వేలు మంజూరైనట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ శుక్రవారం పేర్కొన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు కార్పొరేటర్ తెలిపారు. అభివృద్ధి పనులకు అత్యధిక నిధులు మంజూరు చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్‌కు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

అసోసియేట్ ప్రొఫెసర్ రోషిణికి డాక్టరేట్



కొత్తపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యానగర్ జనప్రియ అవెన్యూ వాసి, ఇబ్రహీంపట్నం సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ రోషిణికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె నగరంలోని ఎంజీఐటీ కాలేజీ సీఎస్‌ఈ విభాగం హెడ్, ప్రొఫెసర్ సీఆర్‌కే రెడ్డి మార్గదర్శకంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అనామలీ డిటెక్షన్ యూజింగ్ ఎస్ఎన్ - ఎల్ఎస్‌టీఎం ఆటోఎన్‌కోడర్స్ టు ఇమ్‌ప్రూవ్ ప్యూరిటీ అండ్ క్వాలిటీ ఆఫ్ వాటర్ బై ప్యారా మీటర్ సజెషన్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు ఆమెకు అభినందనలు తెలిపారు.

న్యాయవాదులకు నివాళి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో మృతిచెందిన న్యాయవాదులకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా కోర్టులో ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గణేష్‌రెడ్డి ఏనుగు, లక్ష్మణాచారి మారోజు, నారాయణరావు, దేశ్‌పాండే, మోహన్‌లాల్ కే, వేణుగోపాల్‌రావు పస్నూరు, మహ్మద్ సమియుద్దీన్, వెంకటేశ్వర్లు నాలం, దేశ్‌ముఖ్ ఎస్ఎం, ఇస్రాయేల్ ఎర్రబాపులకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పట్టాభిరామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

మలక్‌పేటలో 14,885 రేషన్ దరఖాస్తులు నమోదు

● **రేషన్ కార్యాలయానికి చేరినవి 5000**

చాదర్‌ఘాట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం మలక్‌పేటలో 14,885 దరఖాస్తులు నమోదు అయ్యాయి. ఈ విషయాన్ని పౌరసరఫరాల విభాగం మలక్‌పేట సర్కిల్-1 అధికారులు ధ్రువీకరించారు. అయితే మీసేవ ద్వారా కొత్త రేషన్ కార్డు కోసం అర్హులైన నిరుపేద కుటుంబాల వారు దరఖాస్తు చేసుకోగా ఇందులో రేషనింగ్ కార్యాలయానికి చేరిన దరఖాస్తులు కేవలం 5000 అని కూడా ధ్రువీకరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రకటించిన విషయం విధితమే. ఈమేరకు ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశమిచ్చింది. మలక్‌పేట సర్కిల్-1 పరిధిలో సుమారు 14,885మంది దరఖాస్తుదారులు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు స్పష్టమైంది. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగానే ఆయా దరఖాస్తులకు సంబంధించిన పత్రాలను దరఖాస్తుదారులు రేషనింగ్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. దీంతో కొంత మంది దరఖాస్తుదారులు స్వయంగా రేషనింగ్ కార్యాలయంలో నమోదు చేసుకున్న దరఖాస్తు పత్రాలను అందజేయగా మిగతా వారు వాటి పత్రాలను ఇంతవరకు అందజేయలేదని సమాచారం. రేషనింగ్ కార్యాలయానికి చేరిన నమోదైన దరఖాస్తుపత్రాలు ఐదువేలే ఉండడంతో మిగతా దరఖాస్తుదారులు కూడా నమోదైన పత్రాలను రేషనింగ్ కార్యాలయంలో అందజేయాలని తద్వారా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసేందుకు అవకాశముంటుందని అధికారులు తెలిపారు.


పౌరసరఫరాల విభాగం మలక్‌పేట సర్కిల్-1 కార్యాలయం

మొదలైన రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన

కొత్తగా రేషన్ కార్డుల కోసం నమోదు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన పౌరసరఫరాల విభాగం మలక్‌పేట సర్కిల్-1లో మొదలైంది. దరఖాస్తుల పరిశీలన కోసం సర్కిల్-1 అధికార యంత్రాంగం ఐదు టీమ్‌లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం రంజాన్‌మాసం కావడంతో దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా నిర్వహించలేకపోతున్నారు. ఒక్కో బృందం 10మంది దరఖాస్తుదారుల ఇళ్లను పరిశీలిస్తున్నారు. ఇంతవరకు 5వందల దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసినట్లు సమాచారం. ప్రస్తుతం రేషనింగ్ కార్యాలయానికి చేరిన 5వేల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకున్న పత్రాలను తమ వద్ద ఉంచుకున్న దరఖాస్తుదారులు ఆయా పత్రాలను వీలైనంత త్వరగా రేషనింగ్ కార్యాలయానికి చేరవేస్తే ఇంటింటికీ వెళ్లి పరిశీలించే పనులను మరింత వేగవంతం చేసేందుకు అవకాశముంటుందని సర్కిల్-1 సహాయ సరఫరా అధికారి నర్సింగ్‌రాజ్ తెలిపారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందిస్తాం

● **ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

హయత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో చర్చించి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందేలా కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం సంఘం ఆవరణలో చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన సహకార సంఘం 52వ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ రైతులందరికీ వచ్చేవిధంగా ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. తుర్కయంజాల్ మాసబ్‌చెరువును కొందరు స్వార్థపరులు రెండుగా చీల్చారని తెలిపారు. తన దృష్టికి రాగానే అసెంబ్లీలో చర్చించి చెరువు ఎఫ్‌టీఎల్‌లో పూడ్చిన మట్టిని ఎత్తిస్తున్నామని తెలిపారు. చైర్మన్ సత్తయ్య ఆధ్వర్యంలో సహకార సంఘం బాగా అభివృద్ధి సాధించిందని పాలకవర్గాన్ని అభినందించారు. తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్ర బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ టెస్కాబ్‌తో చర్చించి రైతు సేవా సహకార సంఘం సభ్యులకు సబ్సిడీపై డ్రిప్పు ఇరిగేషన్‌ను ఇప్పించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రైతులు తమ తమ స్థలాల్లో కల్లాలను ఏర్పాటు చేసుకుంటే సబ్సిడీ ఇప్పించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. వ్యవసాయ పనిముట్ల రుణం కోసం సహకార సంఘంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాలకవర్గం, సభ్యులు, అధికారుల సహకారంతో సంఘం లాభాల బాటలో నడుస్తుందన్నారు. అనంతరం పాలకవర్గం సభ్యుడు వంగేటి లక్ష్మారెడ్డి, సహకార సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు, మండల వ్యవసాయ అధికారి పల్లవి, టెక్నికల్ ఆఫీసర్ హరినాథ్, పాలకవర్గం సభ్యులు సామ సంజీవరెడ్డి, చెక్క లక్ష్మమ్మ, నర్సింగ్‌రావు, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్కు కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సెక్రెటరీ రాందాసు పాల్గొన్నారు.


తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

మన్సూరాబాద్ : మహిళా సాధికారతతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని పీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాసభ మహిళా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణలు విచ్చేసి విభాగ్ అధ్యక్షురాలు డాక్టర్ ఉప్పల శారదలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విభాగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం సుష్మా, అదనపు ప్రధాన కార్యదర్శి ఎన్.సామ్రాజ్యలక్ష్మి, మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి, రాయపూడి భవాని, సభ్యులు బొడ్డు తిరుమలేశ్వరి, నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి, రుమాళ్ల పద్మ, మ్యాడం కళాప్రియ పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతు భరోసా అమలయ్యేలా చూడండి

● **సబితారెడ్డికి రైతు సహకార సంఘం చైర్మన్ వినతి**

సరూర్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను సక్రమంగా అమలయ్యేలా చూడాలని, అర్హులైన రైతుందరికీ అవి అందేలా చర్యలు తీసుకోవాలని నాదర్‌గుల్‌లోని భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ బాలాపూర్ మండలంలో ఇంకా అనేక మందికి రుణమాఫీ అమలు కాలేదని, రైతు భరోసా సాయం సైతం రాలేదని పేర్కొన్నారు. దాంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే దృష్టి పెట్టి ఆయా పథకాలు వెంటనే అర్హులకు అందేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా తన వంతు ప్రయత్నం చేస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ శాఖల అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భీమిడి జంగారెడ్డి, నందినేని నరేందర్‌రెడ్డి, సామ సుదర్శన్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు

బడంగ్‌పేట్‌లో 'చెట్ల కిందికి' : హాజరైన ఎమ్మెల్యే

సరూర్‌నగర్ : ప్రతియేటా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉగాది పండుగకు ముందు 'చెట్ల కిందికి' పేరుతో నిర్వహించే వన భోజనాల కార్యక్రమం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్పొరేషన్‌కు చెందిన డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో స్థానికంగా గల ఓ తోటలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలతో కలిసి ఆమె చెట్ల కింద సందడి చేశారు. వారు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. వారితో కలిసి వనభోజనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల మహిళా నేతలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

చంపాపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ సాగర్‌రింగ్‌రోడ్‌లో శుక్రవారం సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లిలోని సర్వేనెంబర్ 189, 203లో 577 మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందని వారు పేర్కొన్నారు. ఈ భూములను రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం కబ్జా చేసిందని వారన్నారు. పేదలకు మరోచోట భూములు కేటాయిస్తామని వారు నమ్మించి పేదలను మోసం చేశారని అన్నారు. పేదలకు యథావిధిగా భూములను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్కిల్ కమిటీ సభ్యుడు మంతని యాదయ్య, సీపీఎం సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, కమిటీ సభ్యులు రామస్వామి, భూషరాజు, కాశయ్య పాల్గొన్నారు.



హస్తినాపురం నారాయణ పాఠశాలలో శ్రేయోభిలాషి సైకలాజికల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ కారణాల వల్ల చదువులో వెనుకబడిన పిల్లలకు అలాగే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్‌లో భాగంగా మొబైల్ వినియోగం, అధిక స్క్రీన్ సమయం గురించి విద్యార్థుల పనితీరు, ఆరోగ్యకరమైన సమతుల్యతను ఎలా కొనసాగించాలో వారి తల్లిదండ్రులకు మార్గదర్శకాలను సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జీవీఎల్ శారద, ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ టి.శ్రీదేవి, సభ్యులు డాక్టర్ టీవీ.రావు, రాంచందర్, డాక్టర్ స్వప్న, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, శిల్ప, అనిల్‌కుమార్, రవిప్రసాద్, రాజేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నిర్మాతపై ఫిర్యాదు

సైదాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నిర్మాత పంజాల జైహింద్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రీయ వానరసేన ప్రతినిధులు శుక్రవారం సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేందర్‌కు ఫిర్యాదు చేశారు. మోదీని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల విరోధిగా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అపోహలు కలిగించే విధంగా ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అతడిపై కేసు నమోదు చేయాలని రాష్ట్రీయ వానరసేన అధ్యక్షుడు నామ్ రాంరెడ్డి, వ్యవస్థాపక సభ్యులు చూడామాధవరెడ్డి, ఎడ్ల కేశవర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, మహేశ్వరం రవిచంద్రలు కోరారు.

విశ్వావసు నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్‌బీనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం వారి విశ్వావసు నామ సంవత్సర త్రైతశకం 47వ సంవత్సరం ఉగాది క్యాలెండర్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన జ్ఞాన తెలుగు కాల సూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా రూపొందించారన్నారు. ఈ కాలసూచకలో ఇంకా చాలా విశేషాలు దేవాలయ సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారముతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఇందులో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ గిరి, ఎస్ఎస్ కుమార్, ఎస్. చంద్రశేఖర్, సీహెచ్ మధు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో మహిళ మరణం.. భర్త, అత్తకు జైలు శిక్ష


ఆనంద్


భారతమ్మ

హైదరాబాద్ సిటీ : పెళ్లైన మరుసటి రోజు నుంచే అదనపు కట్నం కోసం వేధించడంతోపాటు భౌతిక దాడులకు పాల్పడి మహిళ మరణానికి కారణమైన ఆమె భర్త, అత్తకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న కలిమెర ఆనంద్ కుమార్ తన తల్లి కలిమెర భారతమ్మతో కలిసి భార్యను అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు భౌతిక దాడులు చేసేవాడు. దాంతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న చైతన్యపురి పోలీసులు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో మహిళ మృతికి భర్త, అత్త కారణమని కోర్టు నిర్ధారించింది. ప్రధాన నిందితుడు ఆనంద్‌కుమార్‌కు జీవిత ఖైదు, అతడికి సహకరించిన భారతమ్మకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ ఎల్బీనగర్ ఏడీజే 3 కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

హయత్‌నగర్ ఖాళీ స్థలంలో అంటుకున్న మంటలు

హయత్‌నగర్ : మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని వీరన్నగుట్ట వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో గడ్డికి మంటలు అంటుకున్నాయి. దీంతో ఎండిపోయిన చెట్లు, గడ్డి కాలి పెద్ద మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు మంటలను ఆర్పివేసి హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎలాంటి ప్రమాదం జరగలేదు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెటు తాగి అగ్గిపుల్లను పడేసి ఉంటారని దీంతో గడ్డికి మంటలు అంటుకుని ఉంటాయని భావిస్తున్నారు.

యువతి ఆత్మహత్య

సైదాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సిద్దిపేట జిల్లా నాగరాజు పాలెంకు చెందిన సాయిలు కుటుంబం నగరానికి బతుకుదెరువుకు వలస వచ్చి సింగరేణి వాంబేకాలనీలో నివాసముంటున్నది. అతని కుమార్తె ప్రీతి (21) శుక్రవారం తన ఇంటి సమీపంలో నివాసముండే అక్క ఇంటికి వెళ్లి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మూడు నెలలుగా జాండీస్ తదితర అనారోగ్య కారణాలతో బాధపడుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తుల దుకాణంలో చోరీ

దిల్‌సుఖ్‌నగర్ : కొత్తపేటలోని ఓ దుస్తుల దుకాణంలో చోరీ జరిగింది. చైతన్యపురి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురానాపూల్‌లో నివసించే దినేష్‌కుమార్‌శర్మ రెండేళ్లుగా కొత్తపేటలో కేఆర్ కసత్ ఫ్యాబ్రిక్స్ పేరుతో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. షాపింగ్ అంటూ దుకాణంలో ప్రవేశించిన గుర్తుతెలియని మహిళలు విలువైన దుస్తులను అపహరించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మంత్రిగా ఉన్నప్పుడు సబితకు పన్నుల భారం కనిపించలేదా ?

● **అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించిన కాంగ్రెస్**

● **మీర్‌పేట్ దీక్షా శిబిరంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ**

సరూర్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా, రాష్ట్రమంత్రిగా వ్యవహరించిన సబితారెడ్డికి అప్పట్లో మీర్‌పేట్ ప్రజలు ఎదుర్కొంటున్న పన్నుల భారం కనిపించలేదా?.. అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ ప్రశ్నించారు. ప్రజలపై నిజంగా ప్రేమ ఉంటే ఆనాడే తగ్గించేవారని, నాడు పట్టించుకోని సబితమ్మ నేడు తమ పార్టీ నాయకులతో ఆందోళనలు చేయించడం ఎంత వరకు సమంజసమని ఆమె అన్నారు. ఇక అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు పన్నుల భారంపై గడప గడపకు తిరిగి ఆందోళనలు చేశారని, నేడు అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారని ఆమె విమర్శించారు. అధిక పన్నులకు నిరసనగా బీజేపీ మీర్‌పేట్ క్లస్టర్-1,2 అధ్యక్షులు పి.భిక్షపతిచారి, టి.ముఖేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రాణిరుద్రమ శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, అధికార ప్రతినిధి జి.వెంకట్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి తదితరులతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి ముక్కు పిండి మరీ పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్, గాజుల మధు, మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, భీమ్‌రాజ్, ఇంద్రావత్ రవినాయక్, కీసరి హరినాథ్‌రెడ్డి, జమునా కృష్ణారెడ్డి, కొంద్రు గౌరీశంకర్, జిల్లెల అరుణాప్రభాకర్‌రెడ్డి, మమతాప్రవీణ్, డి.జ్యోతీకిషోర్, కె.విజయలక్ష్మీరాజు, నాయకులు సూల ప్రభాకర్, లతాశ్రీ, అర్పితారాధాకృష్ణ, రజని, కాశీరాం, జగన్‌ముదిరాజ్, గోపీయాదవ్, సిద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మీర్‌పేట్‌లో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న రాణిరుద్రమ

కన్యాకుమారిలో ముగిసిన గోరక్ష పాదయాత్ర

● **182 రోజులు 5,150 కిలోమీటర్ల పాదయాత్ర**

● **నేడు నగరానికి రానున్న బాలకృష్ణ గురుస్వామి**

సైదాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోహత్యలు ఆపాలని, గో ఆధారిత వ్యవసాయం ప్రోత్సహించాలని కోరుతూ సైదాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి ప్రారంభమైన గోరక్ష పాదయాత్ర గురువారం తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ముగిసింది. సెప్టెంబర్ 27న కాశ్మీర్ నుంచి ప్రారంభమైన గోరక్ష పాదయాత్ర 14 రాష్ట్రాల మీదుగా 5,150 కిలోమీటర్లు, 182రోజుల పాటు కొనసాగింది. పాదయాత్ర ముగింపు సందర్భంగా కన్యాకుమారిలో జరిగిన బహిరంగసభలో అఖిల భారత రాష్ట్రీయ స్వయం సేవక్‌గోసేవ ప్రముఖ్ అజిత్ ప్రసాద్ మహపాత్ర, కాంచీపురం గవ్య సిద్ధ ఆచార్య నిరంజన్‌వర్మ గురూజీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కమల్ టవోరీ, ధర్మ రక్ష వ్యవస్థాపక అధ్యక్షుడు చీకోటి ప్రవీణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పాదయాత్ర ముగించుకుని నగరానికి శనివారం ఉదయం బాలకృష్ణ గురుస్వామి వస్తున్న సందర్భంగా హిందూ సంఘాల నేతలు, గోభక్తులు భారీ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. చంపాపేట భరత్ గార్డెన్ నుంచి లక్ష్మీనగర్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు.